క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీపై ప్రజావేదిక

పోరుమామిళ్ల : మండలంలో 2021 ఏప్రిల్ 1 నుంచి నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజాప్రతినిధుల సమక్షంలో చర్చించడం జరుగుతుందన్నారు.బహిరంగ సమీక్షా కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆమె కోరారు.

ఆప్కో డైరెక్టర్‌గా ఉదయగిరి వెంకటేష్



ఆప్కో డైరెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న వెంకటేష్

మైదుకూరు : పట్టణానికి చెందిన ఉదయగిరి వెంకటేష్ ఆప్కో డైరెక్టర్‌గా సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల ఆప్కో డైరెక్టర్‌గా వెంకటేష్‌ను నియమించడంపై కొందరు హైకోర్టు ద్వారా అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే హైకోర్టులో వారి అభ్యంతరాలు వీగిపోవడంతో వెంకటేష్ నియామకానికి మార్గం సుగమం అయింది. సోమవారం ఆయన విజయవాడలోని ఆప్కో కార్యాలయంలో డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

గృహసారథులు ప్రతి ఇంటికి తిరగాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలను గృహసారథులు ఇంటింటికి తిరగాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం బి.మఠంలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్‌లకు అవగాహన సదస్సులో ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఏదో పథకం అందించామన్నారు. అదే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకొనిపోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమిరెడ్డిపల్లె రామయ్య, ఎంపిటీసీ మనోహరాచారి, కూనపులి రాజానాయుడు, పోలు అంకిరెడ్డి, బీఎస్ నారాయణరెడ్డి, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగశేషారెడ్డి

ప్రొద్దుటూరు : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని 36వ వార్డులో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని పట్టణ వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగశేషారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డితో కలసి ఆయన సోమవారం 45వ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగశేషారెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు, గృహ సారథులతోపాటు కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు కావాల్సిన అవసరాలను తెలుసుకోవాలని సూచించారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

అరటిపంట దగ్ధం

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామానికి చెందిన ఎ.రామారెడ్డికి చెందిన అరటిపంట దగ్ధమైంది. రైతు తెలిపిన వివరాల మేరకు విద్యుత్ వైర్లు తగులుకుని మంటలు చెలరేగి అరటిపంట కాలిపోయిందన్నారు. వెంటనే పోరుమామిళ్ల ఫైర్‌సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. డ్రిప్‌వైర్లు పూర్తిగా కాలిపోయాయని, అధికారులు పంటను పరిశీలించి ఆదుకోవాలని రైతు కోరాడు.

రేపు సబ్‌స్టేషన్ల ప్రారంభం

బద్వేలు : బద్వేలు నియోజకవర్గంలోని పలు మండలాలకు మంజూరైన 11/33 కె.వి. సబ్‌స్టేషన్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, వాటిని బుధవారం ప్రారంభిస్తున్నామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ తెలిపారు. 12వ తేదీ ఉదయం 8–30 గంటలకు కాశినాయన మండలంలోని బాలాయపల్లె సబ్‌స్టేషన్‌ను, 9–30 గంటలకు కలసపాడులోని బ్రాహ్మణపల్లె సబ్‌స్టేషన్, 11–30 గంటలకు పోరుమామిళ్ళలోని సిద్ధవరం సబ్‌స్టేషన్, 12–30 గంటలకు ప్రభుత్వాసుపత్రి వద్ద సబ్‌స్టేషన్‌ను, సాయంత్రం 4 గంటలకు బద్వేలు మండలంలోని కొత్తచెరువు (వీరబల్లి) సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అన్నలూరు పంచాయతీ చౌటపల్లె, అన్నలూరు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగిన ఎమ్మెల్యే ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న వైఎస్సార్ రైతు భరోసా, చేయూత, ఆసరా, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, నాడు– నేడు కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించడమే కాక, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ వ్యవసాయాన్ని పండుగ చేశారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో 98 శాతం మంది ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందారని అన్నారు. కుల, మతాలకు, పార్టీలకతీతంగా సీఎం జగన్ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అన్నలూరు సర్పంచ్ మాచిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, ఏపీ సుబ్బారెడ్డి, బండి నాగేంద్రప్రసాద్, ఇడగొట్టు శేషు, ఇర్షాద్, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు కొండా భాస్కర్‌రెడ్డి, గౌస్‌లాజం, తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ కుళ్లాయమ్మ, ఏఓ లక్ష్మిప్రసన్న, పీఆర్‌ఏఈ మధుసూదన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తికరంగా ప్రజలకు సంక్షేమ పథకాలు

దువ్వూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలు ప్రజలకు సంతృప్తికరంగా అందిస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులను ప్రభుత్వం అందిస్తున్న పథకాల పట్ల సంతృప్తి చెందినట్లయితే వారి సమ్మతితో స్టిక్కర్ అతికించాలని చెప్పారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 15 కుటుంబాలు చేరిక

దువ్వూరుకు చెందిన టీడీపీ నాయకుడు ఎస్.హుస్సేన్‌పీరా, ఆయన అనుచరులు 15 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు తమను ఆకర్షించాయని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, మండల సచివాలయల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అమీర్, నాయబ్, వీవీ స్వామి, రమణయ్య, గృహసారథులు, కుంపటి ఖాజాపీర్, బాషా తదితరులు పాల్గొన్నారు.



దువ్వూరు: కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

'జగనన్నే మా భవిష్యత్తు'కు అపూర్వ స్పందన



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : ఈ నెల 7 నుంచి ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోంది. పార్టీ నిర్దేశించిన గడువులోగా కార్యక్రమం పూర్తి చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపాలిటీ పరిధిలోని గృహసారథుల, పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా సచివాలయాల పరిధిలోని నాయకులు, కౌన్సిలర్లు, వలంటీర్లతో కలిసి గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్ళి కొంత సమయం కేటాయించి గత ప్రభుత్వ హయాంలో పాలన, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పాలన మధ్య తేడాలను వివరించాలని కోరారు. అలాగే సంబంధిత గృహ యజమానితో ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నాపత్రాన్ని పూరించాలని సూచించారు. ప్రజలకు జగనన్న చేస్తున్న మంచిని అర్థమయ్యే రీతిలో వివరించాలని కోరారు. కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద యజమాని అనుమతితో స్టిక్కర్ అంటించడంతో పాటు పార్టీ సూచించిన నెంబరుకు తప్పనిసరిగా మిస్డ్‌కాల్ ఇప్పించాలని కోరారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్తు ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు బంగారుశీనయ్య, ఆయా కార్పొరేషన్‌ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, అల్లాబకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మిదేవిశ్రీరాములు, వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి

గోపవరం : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బద్వేలు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్యపరీక్షలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా గుర్తించిన గర్భిణుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆసుపత్రికి తీసుకువచ్చి వారికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఇవ్వడమే గాక అత్యవసరమైతే బద్వేలు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేయాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు. ఉపాధి హామీ పథకం పనులకు వెళ్ళే కూలీలు కూడా ఉదయాన్నే వెళ్ళి 10 గంటలలోపు ఇంటికి చేరుకోవాలన్నారు. గ్రామాల్లోని హెల్త్‌సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, వడదెబ్బ బారిన పడితే వెంటనే ఆయా కేంద్రాలకు వెళ్ళి ప్రాథమిక చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నర్మద, డాక్టర్ వెంకటరత్నాలు, సీహెచ్‌ఓ గౌస్, సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం



ఆశ్రమంలో భోజనం వడ్డిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కూరగాయల మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని మదర్ థెరిసా ఆశ్రమంలో మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ నాయకుడు కసిరెడ్డి మహేశ్వరరెడ్డి అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగశేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, ద్వార్శల గురునాథరెడ్డి, క్లాసిక్ మొబైల్స్ యజమాని జాఫర్, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవితోపాటు పలువురు కౌన్సిలర్లు, ఆయిల్ కబీర్, మనిరెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం మున్సిపల్ పెట్రోలు బంకు వద్ద సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైస్ చైర్మన్ ప్రారంభించారు.

అన్నదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శివోహం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివోహం కమిటీ అధ్యక్షుడు రాంప్రసాద్‌రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బుచ్చనపల్లె చెరువు ఆక్రమణ



బుచ్చనపల్లె చెరువు ఆయకట్టును చదును చేసిన దృశ్యం

గోపవరం : మండలంలోని టీ.సండ్రపల్లె సచివాలయం పరిధిలో బుచ్చనపల్లె చెరువు ఆక్రమణకు గురైంది. అదే గ్రామానికి చెందిన వ్యక్తి రెండు రోజుల క్రితం జేసీబీని ఉపయోగించి చెరువు ఆయకట్టును చదును చేశాడు. సచివాలయానికి కూతవేటు దూరంలోనే చెరువు ఆక్రమణకు గురవుతున్నా స్థానిక రెవెన్యూ సిబ్బందికి సమాచారం లేదంటే పరిస్థితి ఏవిధంగా తెలిసిపోతుంది. రెండు రోజుల క్రితం మండలంలో పర్యటించిన ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి దృష్టికి బుచ్చనపల్లె గ్రామస్తులు చెరువు ఆక్రమణకు గురైన విషయాన్ని తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఆక్రమణను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెరువు ఆక్రమణపై దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : గర్భిణులు ప్రతి నెలా తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సగిలి సుస్మిత తెలిపారు. రక్తహీనత కలగకుండా ఐరన్ మాత్రలను వాడాలని సూచించారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 40 మంది గర్భిణులకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని చెప్పారు. గర్భిణులకు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, చంద్రకళ, సీహెచ్‌ఓలు కృష్ణమ్మ, ప్రణీత, శిరీష, సీనియర్ అసిస్టెంట్ మధు, ఫార్మసిస్టు శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

రూ.3 మజ్జిగ కేంద్రం ప్రారంభం



మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, కొనిరెడ్డి హిమజారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో సోమవారం కొనిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.3 మజ్జిగ కేంద్రాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కుమార్తె హిమజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ వేసవిలో పేదల దాహార్తిని తీర్చడానికి రూ.3 మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, చంద్రకాఫీ నిర్వాహకుడు జొన్నలగడ్డ రామచంద్రప్రకాష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కోత లేకుండా కార్డియాక్ సర్జరీ



మాట్లాడుతున్న డాక్టర్ ధీరజ్‌రెడ్డి

కడప రూరల్ : గుండె శస్త్ర చికిత్సకు సంబంధించి ఎంబీసీఎస్‌లో వచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా కనీస కోత లేకుండా కార్డియాక్ సర్జరీ నిర్వహిస్తున్నట్లు చెన్నై అపోలో ఆస్పత్రి వైద్యులు ధీరజ్‌రెడ్డి తెలిపారు. స్థానిక అరుణాచల ఆస్పత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గుండె శస్త్ర చికిత్సలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. గుండె శస్త్ర చికిత్స అంటే ఛాతి మధ్యభాగంలో కోత వేయడం వల్ల భారీ మచ్చ ఏర్పడుతుందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కనీస కోత లేకుండా కార్డియాక్ సర్జరీని నిర్వహిస్తామన్నారు. ఈ విధానం వల్ల కణజాల గాయం తగ్గడంతోపాటు గాయం సంక్రమణ చెందకుండా ప్రమాదాన్ని తగ్గిస్తుందన్నారు. బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీనియర్ జనరల్ మేనేజర్ నాగార్జునరెడ్డి, బాల భాస్కర్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



అట్లూరులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హమీదబేగం

కాశినాయన : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నరసాపురం, రంపాడు, వరికుంట్ల సచివాలయాల పరిధిలోని 32 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. బరువు, హెచ్‌బీ గ్రూపు, రక్తపరీక్షలు, యూరిన్ పరీక్షలు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు పోషకాలు కలిగిన ఆకుకూరలు, మాంసకృత్తులు, ఖనిజలవణాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనానికి ఫోన్ చేసి ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రులలోనే కాన్పులు చేసుకుని ప్రభుత్వం ఇచ్చే పారితోషికం పొందాలన్నారు. కాన్పు అయిన వెంటనే తల్లిబిడ్డ వాహనం ద్వారా ఇంటికి చేరుస్తారని తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

అట్లూరు : గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ కె.హమీదబేగం తెలిపారు. సోమవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులలకు ఆమె వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని, గర్భస్థ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్‌ఆఫీసర్ మురళీకృష్ణ, మండల నోడల్ అధికారి వి.భాస్కర్, వైద్య సిబ్బంది లక్ష్మీదేవి, వీరంద్రబాబు, సులోచన, నజీని, లత, ఆశా కార్యకర్తలు, గర్భిణీస్త్రీలు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత ఉండకూడదు

చాపాడు : గర్భిణుల్లో రక్తహీనత సమస్య ఉందని, పరిష్కారానికి పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం ద్వారా గైనకాలజిస్ట్ సుమిత్ర గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత లేకుండా ఉండేందుకు పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో మహిళా వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ప్రసవానికి గర్భిణులు పీహెచ్‌సీకి రావాలని సూచించారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు చాపాడు మాజీ సర్పంచ్ అక్బర్ వలి దంపతులు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ, సీహెచ్‌ఓ రాముడు, క్లస్టర్ పర్యవేక్షకులు భాస్కర్, రమేష్, వైదీ సుబ్బారెడ్డి, రవి శంకర్‌రెడ్డి, ఎస్ఆర్ఐ అబ్దుల్ కరీం, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం (జమ్మలమడుగు రూరల్): మైల వరంలోని ఏపీ గురుకుల పాఠశాల (బాలికలు)లో 2023–2024 విద్యా సంవత్సరానికి 5,6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ జె.వి.ప్రభావతి దేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రవేశపరీక్ష మే 20వ తేదీ జిల్లా ప్రధాన కేంద్రాల్లో నిర్వహించనున్నారన్నారు.

పరిహారం పెంచాలని వినతి

జమ్మలమడుగు: నంద్యాల–జమ్మలమడుగుకు సంబంధించిన హైవే రోడ్డు నిర్మాణంలో తమ భూములకు పరిహారం ఎక్కువగా ఇప్పించాలంటూ కన్నెలూరుకు చెందిన రైతులు ఆర్డీఓ జి. శ్రీనివాసులకు వినతి పత్రం సమర్పించారు. సోమవారం వారు స్పందన కార్యక్ర మంలో ఆర్డీఓను కలిసి తమ సమస్యను వివరించారు. ఈసందర్భంగా రైతులు మోహన్‌రెడ్డి, చౌడయ్యలు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ విలువ ఆప్రాంతంలో ఎక్కువగా ఉంది. తమ భూములే ఎక్కువగా పోతున్నాయి. అధికారులు న్యాయం చేయించాలంటూ వివరించారు.

రైతు భరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకోండి

కొండాపురం : మండలంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం కోసం అర్హులై ఉండి రానివారు ఎవరైనా ఉంటే ఆయా రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. అరుణ సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ గతంలో పట్టాదారు పాసుపుస్తకం కొత్తగా వచ్చి ఉండి ఉంటే అర్హత గల రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతానెంబర్, రైతు ఫోన్‌నెంబర్ వివరాలు సిబ్బందికి ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అర్హులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ–98 అర్హులైన అభ్యర్థులందరికీ త్వరగా ఉద్యోగాలు ఇవ్వాలని సోమవారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 580 మంది డీఎస్సీ–98లో వెరిఫికేషన్ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి విద్యాశాఖ అధికారులు జాబితాను పంపారన్నారు. కానీ జిల్లాలో 172 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇస్తున్నారని మిగతా వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. డీఎస్సీ–98 అభ్యర్థులు చంద్రమౌళి, మురళీమోహన్‌రెడ్డి, ఎరుకలయ్య, శివాజీ, సుధాకర్, నారాయణరెడ్డి, సాంబశివారెడ్డి, రమణారెడ్డి, జనార్ధన్, గురప్ప, చంద్రశేఖర్, వెంకటరమణ, రమేష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్లపాడులో జగనన్నే మా భవిష్యత్తు



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

రాజుపాళెం : మండలంలోని పర్లపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు కసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి గల తేడాలని ప్రజలకు వివరించారు. జగనన్న పాలనకు మద్దతు తెలిపినందుకు ఆ కుటుంబ అనుమతితో ఆ పార్టీ ఎంపిక చేసిన ఫోన్ నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వడం జరిగిందని, ప్రజా మద్దతు పుస్తకంలో ప్రశ్నాపత్రం నింపి రశీదును అందించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు పరిమళ, బాలస్వామి, సుదర్శన్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కనులపండువగా ఆది దంపతుల కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : కడప నగరం మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకా లు నిర్వహించి వధూవరులుగా ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కల్యాణమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం అర్చకులు రవిశంకర్ ఆధ్వర్యంలో వేద పండితుల బృందం ఆది దంపతుల కల్యాణాన్ని క్రమంగా నిర్వహించారు. భక్తుల పంచాక్షరి నామ జపం వద్ద కల్యాణోత్సవాన్ని కోలాహలంగా సాగింది. దేవదాయశాఖ కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సూట్ లేకుండా చీనీ కాయలు కొనుగోలు



చీనీ కాయల వేలం పాటను పర్యవేక్షిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : రైతులు పండించిన చీనీ కాయలకు మార్కెట్ యార్డులో సూట్ లేకుండా చీనీ కాయలను వ్యాపారులు కొనుగోలు చేయడం అభినందనీయమని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప ఆధ్వర్యంలో రైతులు తెచ్చి చీనీ కాయలకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో (టన్ను) రూ.20 వేలు నిర్ణయించగా.. నారాయణరెడ్డి రూ.29 వేలకు పాట పాడి 18 టన్నుల ఏ గ్రేడ్ చీనీ కాయలను దక్కించుకున్నారు. అదే రైతులకు సంబంధించి బి గ్రేడ్ చీనీ కాయలను రూ.10 వేలతో రెండున్నర చీనీ కాయలను దక్కించుకున్నారు. అలాగే మరో రైతు పండించిన చీనీ కాయలను భాస్కర్ అనే వ్యాపారి రూ.26,500లకు ఏ గ్రేడ్ చీనీ కాయలను వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషితో ఈ మార్కెట్ యార్డును నిర్మించామన్నారు. వైఎస్సార్ ఉద్యాన శాఖ బోర్డు మెంబర్ శివప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, రైతులు పాల్గొన్నారు.